డ్రైవింగ్‌లో నో సెల్



ఆర్టీసీ యాజమాన్యం ప్రమాదాల నివారణపై దృష్టి సారించింది. డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు మొబైల్ ఫోన్ వినియోగించకుండా చర్యలు చేపట్టింది.

10లో▸



వరదొస్తే ఆగాల్సిందే..! 11లో▸

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో వాగులు పొంగిపొర్లుతున్నాయి. లోలెవల్ వంతెనలపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో గంటల తరబడి రాకపోకలు స్తంభిస్తున్నాయి.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అల్పపీడన ప్రభావంతో పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

వేతనాలు చెల్లించాలని నిరసన



రిమ్స్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్, సూపర్ స్పెషాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తక్షణమే వేతన బకాయిల విడుదలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నూతన టెండర్లు పిలవాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఇందులో సంఘం నాయకులు పొచ్చన్న, సుమన్, దశాంత్, కె.రమేశ్, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని మూడేళ్లుగా పోరాటం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇందులో కార్మికులు ఉమ, రాధ, పోసాని, లక్ష్మి, అనసూయ, షాహిన్, వామన్ తదితరులు పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్

ఆదిలాబాద్‌టౌన్: సైన్స్‌పై విజ్ఞానం పెంపొందించుకుని విద్యార్థులు భావితర శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా సైన్స్ అధికారి ఆరె భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్ చౌక్‌లో గల సరస్వతి శిశుమందిర్‌లో విభాగ్ స్థాయి గణిత మేళా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు సైన్స్‌లో రాణించేలా మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఇందులో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రఘురమణ, శిశుమందిర్ ప్రతినిధులు శ్రీనివాస్, బజరంగ్ అంగర్వాల్, హన్మాండ్లు, సుహాసినిరెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో అభ్యసించాలి



ఫైరింగ్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్: ఎన్‌సీసీ కేడెట్లు ఏకాగ్రతతో అభ్యసించాలని 32టి బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ వీపీ సింగ్ అన్నారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం 5వ రోజుకు చేరుకుంది. కేడెట్లకు సోమవారం కూడా ఫైరింగ్‌లో శిక్షణ అందించారు. ప్రతీ అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఏవో అరవింద్ కిచ్చర్, జగ్రామ్, అశోక్, ప్రశాంత్, రజిత, రాజేశ్వరి, ఆనంద్‌రావు, పూర్ణచందర్, తదితరులున్నారు.

ఖైరతాబాద్ గణనాథునికి ఎమ్మెల్యే 'పాయల్' పూజలు



మహాగణపతికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మహా వినాయకుడిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండప నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు రామారావు పటేల్, హరీశ్‌బాబు, సూర్యనారాయణ గుప్తా ఉన్నారు

టెండర్‌కు రెడీ

- నోటిఫికేషన్‌కు సిద్ధమవుతున్న ఎక్సైజ్‌శాఖ
- ఉమ్మడి జిల్లాలో వైన్స్‌ల సంఖ్య మారట్లే..
- అంతగా నడవని షాప్‌లు మాత్రం రీలొకేషన్?

ఉమ్మడి జిల్లాలో వైన్స్‌ల సంఖ్య..

జిల్లా	వైన్స్‌ల సంఖ్య
ఆదిలాబాద్	40
నిర్మల్	47
మంచిర్యాల	73
కుమురంభీం ఆసిఫాబాద్	32
మొత్తం	192



సాక్షి,ఆదిలాబాద్: వైన్‌షాపుల టెండర్ నోటిఫికేషన్‌కు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏర్పాట్లపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. ఈ సారి ఉమ్మడి జిల్లాలో వైన్స్‌ల సంఖ్యలో మార్పు ఉండకపోవచ్చని తెలుస్తోంది. అయితే మంచిర్యాలలో స్లాబ్‌రేటు పెరగనుండగా.. అంతగా నడవని షాపులను మాత్రం రిలొకేషన్ చేయనున్నట్లు సమాచారం.

రీ లొకేషన్‌కు అవకాశం..

వైన్‌షాపునకు సంబంధించి జనాభా ప్రాతిపదికన స్లాబ్ రేటు అమలు చేస్తారు. ఈ ప్రకారం ఏటా ఆ విలువ కంటే పది రేట్లకు పైగా ఎక్కువ విక్రయాలు జరిగితే ఆ షాపును మంచి ఆదాయం ఉన్నట్లుగా పరిగణిస్తారు. అయితే జిల్లాలో కొన్ని వైన్స్‌ల ఆదాయం తక్కువగా ఉండటంతో వాటిని మరో చోటికి తరలించాలని ఎక్సైజ్‌శాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలవారీగా రీలొకేషన్ జాబితా రూపొందించినట్లు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ఎక్సైజ్‌శాఖ ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలో ఇవి పని చేస్తాయి. జిల్లాల్లో డీపీఈవోలు అధికారులుగా ఉన్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీకి సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇప్పటికే విధివిధానాలన్నింటినీ ఆ శాఖ పూర్తి చేసింది. ప్రభుత్వం ఎప్పుడు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చినా అందుకు రెడీగా ఉంది.

అదే సంఖ్యలో వైన్స్‌లు..

ఉమ్మడి జిల్లా పరిధిలో గత ఎక్సైజ్ పాలసీలో ఉన్న వైన్స్‌ల సంఖ్య ఈ సారి మారకపోవచ్చని తెలుస్తోంది. అయితే అంతగా నడవని వైన్స్‌లను రీలొకేషన్ పేరిట అదే జిల్లాలోని ఇతర ప్రాంతాలకు మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఆదాయం లేని వైన్స్‌లను ఎక్సైజ్ శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. టెండర్ నోటిఫికేషన్‌కు ముందు ప్రభుత్వం వీటిపై పరిశీలన జరపనుంది. వాటిని రీలొకేషన్ చేయాలని ఆదేశాలు ఇచ్చిన పక్షంలో ఎక్కడికి మార్చాలి అనేదానిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా శాఖ అధికారులు రీలొకేషన్ కోసం పరిశీలన కూడా చేస్తున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో ఏటా సుమారు రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకు మద్యం విక్రయాలు జరుగుతాయి.

మంచిర్యాలలో పెరగనున్న స్లాబ్ రేట్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి గత ఎక్సైజ్ పాలసీలో మూడు స్లాబ్ రేట్లు అమలులో ఉన్నాయి. రూ.60 లక్షలు, రూ.55 లక్షలు, రూ.50 లక్షలు జనాభా ప్రాతిపదికన ఇప్పటివరకు కొనసాగాయి. ప్రస్తుతం మంచిర్యాల కార్పొరేషన్ కావడంతో నూతన పాలసీలో అక్కడ స్లాబ్ రేటు రూ.65 లక్షల వరకు పెంచనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ విధివిధానాలు రూపొందించినట్లు సమాచారం. నిర్మల్, కుమురంభీం, ఆదిలాబాద్ జిల్లాల్లో పాత విధానాల్లోనే స్లాబ్ రేట్లు కొనసాగనున్నాయి. ఇదిలా ఉంటే గతంలో టెండర్ దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా, ప్రభుత్వం ఈ సారి రూ.3లక్షలకు పెంచే అవకాశం ఉందనే ప్రచారం సాగుతుంది. ఇదిలా ఉండగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండగా, వాటి తర్వాతే వీటి నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖలో ప్రచారం సాగుతుంది.

విధివిధానాలు ఖరారు కాలేదు..

ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో విధివిధానాలు ఖరారు కావాల్సి ఉన్నాయి. ఆ తర్వాతే కొత్త ఎక్సైజ్ పాలసీపై స్పష్టత వస్తుంది. రీలొకేషన్ విషయంలోనూ ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగానే వెళ్లడం జరుగుతుంది.

– కె.రఘురాం, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ శాఖ, ఆదిలాబాద్ డివిజన్

బడులకు రేటింగ్

- 'స్వచ్ఛ ఏవమ్ హరిత్' కింద పాఠశాలల ఎంపిక
- ఈనెల 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పచ్చదనం, పరిశుభ్రత నిర్వహణపై..
- జాతీయస్థాయిలో ఎంపికైతే రూ.లక్ష ప్రోత్సాహకం

జిల్లాలో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	1,471
విద్యార్థులు	1,46,880
ప్రభుత్వ ఉపాధ్యాయులు	2,667



'స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్' లోగో

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి దేశవ్యాప్తంగా బడులకు రేటింగ్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్యాలయ రేటింగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో నిర్వహణకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా 20 పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో పాఠశాలకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకంతో పాటు సంబంధిత ఉపాధ్యాయులను మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా ఉన్న విహార కేంద్రాల సందర్శనకు తీసుకెళ్లనున్నారు. అయితే ప్రభుత్వం ఇదివరకు స్వచ్ఛత పురస్కారాలు అందజేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమం నిలిచిపోగా, మళ్లీ జాతీయస్థాయిలో పాఠశాలలకు రేటింగ్ పేరుతో పురస్కారాలు అందించనున్నారు.

కార్యక్రమ తీరుతెన్నులు..

జిల్లాలో ప్రభుత్వ, లోకల్‌బాడీ, ప్రైవేట్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ తదితర పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్ల యాజమాన్యాలు స్వచ్ఛ ఏవమ్ హరిత్ స్కూల్ రేటింగ్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 30 వరకు గడువు ఉంది. పాఠశాలల్లోని తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రత, తదితర పాఠశాల నిర్వహణపై ఆన్‌లైన్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అక్టోబర్‌లో కమిటీ బృందం తనిఖీ చేపడుతుంది. 3–స్టార్ వచ్చిన పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన ఆరు పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత రాష్ట్రస్థాయిలో 4–స్టార్ వచ్చిన వాటిని జాతీయస్థాయికి ఎంపిక చేస్తారు. దేశంలోని ఉత్తమంగా ఉన్న 200 పాఠశాలలకు స్వచ్ఛ ఏవమ్ హరిత్ పురస్కారం అందజేస్తారు. రూ.లక్ష నగదుతో పాటు ఉపాధ్యాయులను విహార యాత్రకు తీసుకెళ్తారు. అయితే 35 నుంచి 50 పాయింట్లు ఉన్న పాఠశాలలకు 2–స్టార్, 51 నుంచి 74 పాయింట్లు గల పాఠశాలలకు 3–స్టార్, 75 నుంచి 89 పాయింట్లు ఉన్న స్కూళ్లకు 4–స్టార్, 90 నుంచి 100 పాయింట్లు ఉన్న బడులకు 5–స్టార్ కేటాయిస్తారు.

పురస్కారంతో బాగుపడనున్న స్కూళ్లు..

స్వచ్ఛ ఏవమ్ హరిత్ పురస్కారంతో సర్కారు పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత నెలకొననుంది. మరుగుదొడ్ల నిర్వహణ బాగుపడనుంది. ఆయా బడుల్లో స్వచ్ఛ వాతావరణం నెలకొల్పడానికి దోహదపడుతుంది. అయితే ప్రస్తుతం చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నీటిసదుపాయం ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటడం, పరిసరాల శుభ్రత, పచ్చదనం కోసం దోహదపడనుంది. జాతీయస్థాయిలో ఎంపికైతే జిల్లాతో పాటు పాఠశాలకు మంచి గుర్తింపు లభిస్తుంది.

30 వరకు దరఖాస్తు గడువు..

'స్వచ్ఛ ఏవమ్ హరిత్ స్కూల్ రేటింగ్' కింద పాఠశాలలను జాతీయస్థాయిలో ఎంపిక చేస్తారు. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎంఈవోలు, మండలానికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున సోమవారం డైట్ కళాశాలలో శిక్షణ కల్పించాం. జాతీయ స్థాయిలో ఎంపికైన పాఠశాలకు రూ.లక్ష ప్రోత్సాహం అందజేస్తారు. ఈ నిధులను పాఠశాల అభివృద్ధికి ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత ఉపాధ్యాయుడిని విహార యాత్రకు తీసుకెళ్తారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– ఉష్కం తిరుపతి, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

'వేసవి' పనులపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న ఇరిగేషన్ ఏఈ రమేశ్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో వేసవి నీటి ఎద్దడి నివారణకు రూ.37.73 లక్షలతో చేపట్టిన పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గతంలో ఆరోపణలు వెల్లువెత్తాయి. సీజన్ ముగిసే క్రమంలో పనులు చేపట్టడం, పారదర్శకత పాటించకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్లకు పనులు కేటాయించడాన్ని ప్రస్తావిస్తూ 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందులో భాగంగా రూ.18లక్షల స్ట్రీట్ వెండర్స్ షెడ్ల నిర్మాణ పనుల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ఆ పనులు చేయకుండానే మరో టెండర్ అప్పగించడాన్ని అందులో ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఈ పనుల్లో అక్రమాలపై కలెక్టర్ రాజర్షిషా ఇటీవల సీరియస్ అయ్యారు. విచారణకు ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ ఏఈ రమేశ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో ఏఈ సోమవారం మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చేరుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడారు. పనుల ప్రగతి, అగ్రిమెంట్లు, ఎంబీ రికార్డులు వంటి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, మున్సిపల్ ఇంజినీర్ అందుబాటులో లేకపోవడంతో మరోసారి వచ్చి విచారణ చేస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వచ్చిన ప్రతీ ఫిర్యాదును స్వీకరిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. స్థానిక పోలీ సు ముఖ్య కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి న 23 మంది ఎస్పీకి అర్జీలు సమర్పించారు. అనంతరం ఆయన సంబంధిత పోలీసు అధికా రులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా భూ సమస్యలు, కుటుంబ కలహాలు, కేసుల దర్యాప్తు, పురోగతి వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదు ల విభాగం అధికారి కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై షీటీం ప్రత్యేక దృష్టి

మహిళల భద్రత కోసం షీటీం పనిచేస్తుందని, ఆకతాయిలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాత్రి సమయాల్లో ఆకతాయిలు మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. షీటీంలు రద్దీ ప్రదేశాల్లో సంచరిస్తూ మహిళలను వేధిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు పేర్కొన్నారు. యు వతులు, విద్యార్థినులు ఆపత్కాల సమయంలో 87126 59953 నంబర్‌పై షీటీంను సంప్రదించాలని సూచించారు.

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- కలెక్టర్ రాజర్షి షా
- ప్రజావాణికి 84 దరఖాస్తులు



అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు సాంత్వన చేకూర్చాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోనితో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు దరఖాస్తులను అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం వివిధ సమస్యలకు సంబంధించి 84 అర్జీలు అందాయి. అందులో కొందరి నివేదన..

రోడ్డు కష్టాలు తీర్చండి



మా గ్రామానికి వెళ్లే రోడ్డు పొచ్చెర నుంచి అధ్వానంగా మారింది. రూ.17కోట్ల వ్యయంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కంకర వేసి మధ్యలోనే వదిలేశాడు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– కప్పర్ల గ్రామస్తులు, తాంసి

గిట్టుబాటు కావడం లేదు..



మేము జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో విద్యార్థులకు ఆరేళ్లుగా భోజనం వండి వడ్డిస్తున్నాం. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.7.20 మాత్రమే చెల్లిస్తోంది. మాకు గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం ఇటీవల నూతన మెనూ ప్రకటించినా ధర మాత్రం పెంచలేదు. దీంతో ఇబ్బందులకు గురవుతున్నాం. నూతన మెనూ ప్రకారం రూ.9.40 చొప్పున చెల్లించాలని కోరుతున్నాం.

– వసతి గృహాల కేటరింగ్ నిర్వాహకులు

మా ఇబ్బందులు గుర్తించండి



మేమంతా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని పీహెచ్‌సీల పరిధిలో క్షేత్రసాయిలో పనిచేసే సీహెచ్‌వో, ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్ఎన్, ఎంపీహెచ్ఎస్ ఉద్యోగులం. మాకు ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో 4నుంచి 5 సబ్‌సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీకి వెళ్లి అటెండెన్స్ నమోదు చేసి ఫీల్డ్‌కు వెళ్లాలంటే 40నుంచి 50 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ఇబ్బందిగా మారుతుంది. మాకు ఆధార్ బేస్డ్ హాజరు నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులు

పరిహారం అందించండి



ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరంతా మా ఇళ్లలోకి చేరింది. నిత్యావసర సరుకులతో పాటు ఇతర సామగ్రి పూర్తిగా తడిసి తీవ్రంగా నష్టపోయాం. అధికారులు సర్వే చేసి మా వివరాలు తీసుకున్నప్పటికీ ఎలాంటి పరిహారం అందలేదు. త్వరగా స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– వరద బాధితులు, మహాలక్ష్మివాడ, ఆదిలాబాద్

ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆందోళన



నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

- సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్

కైలాస్‌నగర్: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పెన్షన్ విద్రోహ దినంగా పాటించారు. నల్లబ్యాడ్జీలు ధరించి టీఎన్జీవోస్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. మెయిన్ గేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ సంద అశోక్ మాట్లాడుతూ.. సీపీఎస్ అములుతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఓపీఎస్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సెక్రెటరీ జనరల్ కె.శివకుమార్, కోచైర్మన్ కె.కిష్టన్న, జేఏసీ బాధ్యులు ఎ.నవీన్‌కుమార్, సోగాల సుదర్శన్, నవీన్ యాదవ్, బెజ్జంకి రవీంద్ర, లక్ష్మారెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా

భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్ మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం ఇవ్వాల్సిన నష్టపరిహారం ఇప్పటివరకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. గతంలో ఎకరాకు రూ.8లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, ప్రస్తుతం భూమి విలువ పెరిగినందున పరిహారాన్ని రెట్టింపు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విషయాన్ని ప్రస్తావించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కిరణ్, మంజుల, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో ఈ నెల 4, 6 తేదీల్లో నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులంతా పొరపాట్లకు తావివ్వకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గట్టి భద్రత చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారులపై గుంతలు పూడ్చడంతో పాటు తిలకించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జనం చేపట్టనున్న ఆ రెండు రోజులు మద్యం షాపులు పూర్తిగా మూసివేయాలని, ఎక్సైజ్ అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పెన్‌గంగ వద్ద క్రేన్లు, గజ ఈతగాళ్లు, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్‌సీసీ, ఆపద మిత్ర బృందాలను రంగంలోకి దించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. అన్ని మండపాల వద్ద మొబైల్ బృందాలు తిరుగుతూ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. జిల్లా ప్రజలు, భక్తులు శోభాయాత్ర శాంతియుతంగా సాగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా, డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు నిర్మల్ జిల్లా కుంటాల మండలం అంబకంటికి చెందిన మానేటి నాగభూషణం ఆదిలాబాద్ పట్టణంలోని దివ్యాంగుల కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు సతీష్‌కుమార్ (20) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విధులను ఆటంకపర్చిన 20 మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల విధులను ఆటంకపర్చిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. గతనెల 30న సాత్నాల మండలంలోని తలాయితాండకు చెందిన చౌహాన్ కమలాబాయి మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు రిమ్స్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మార్చురీ వద్ద ఆందోళన చేపట్టారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు పోలీసు విధులను ఆటంకపర్చిన దత్తు, అంకుష్, కైరామ్, రాథోడ్ దినేష్, శ్యామ్‌రావ్ నాయక్, సంతోష్‌తో పాటు మొత్తం 20 మందిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఈ సందర్భంగా వివరించారు.

బాసర ఆలయ ఈవోగా అంజనాదేవి

బాసర: బాసర జ్ఞాన సరస్వతి ఆలయానికి నూతన ఈవోగా అంజనాదేవిని నియమిస్తూ దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల క్రితం కలెక్టర్ అభిలాష అభినవ్ బాసర ఆలయ స్పెషల్ ఆఫీసర్‌గా భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను దేవాదాయశాఖ రద్దు చేసింది.

ఎస్సార్పీ ఓపీపీని సందర్శించిన ఈడీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీని సింగరేణి కోల్ మూవ్‌మెంట్ ఈడీ బీ.వెంకన్నయాదవ్ సోమవారం సందర్శించారు. ముందుగా జీఎం కార్యాలయంలో అధికారులతో బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఓసీపీ ఆవరణలో మొక్కలు నాటి క్వారీని పరిశీలించారు. బొగ్గు రవాణా కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కోల్‌బెంచీలను, సీహెచ్‌పీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం ఎన్.సత్యనారాయణ, ఓసీపీ పీవోలు ఏ.వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, క్వాలిటీ ఇన్‌చార్జి కే.వెంకటేశ్వర్‌రెడ్డి, గని రక్షణాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో..

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీని కోల్ మూమెంట్ ఈడీ వెంకన్న జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా కోల్‌యార్డు, రైల్వే ట్రాక్‌లైన్, ట్రాక్ హాపర్‌లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, అధికారులు నర్సింహారావు, మురళీధర్, మదన్‌మోహన్, తదితరులు ఉన్నారు.

సరస్వతి చెరువుకు బుంగ



బుంగలోంచి వృథాగా పోతున్న నీరు

ఉట్నూర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రెండు రోజుల క్రితం మండలంలోని సరస్వతి చెరువుకు బుంగ ఏర్పడి నీరంతా వృథాగా పోతోంది. దీంతో చెరువుకట్ట తెగిపోతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం రైతులంతా వరినాట్లు వేసుకున్నారు. గతంలో ఇదే చెరువు కట్ట తెగిపోయినప్పుడు తాత్కాలికంగా మట్టిని నింపారని, మరమ్మత్తులు సరిగా చేయకపోవడంతో సమస్య పునరావృతం అయిందని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువుకట్ట తెగి నీరంతా పొలాల్లోకి చేరితే పంటలు కొట్టుకుపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా మత్స్యకారులు సైతం ఈ చెరువుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుకట్టకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని స్థానిక రైతులు పవార్ రాజు నాయక్, జాడి రాజన్న, యాట గంగయ్య, జాడి మల్లేశ్, భక్తు శ్రీనివాస్, భక్తు మల్లయ్య కోరుతున్నారు.

కష్టపడి పనిచేసే వారికే ప్రాధాన్యత

మంచిర్యాలటౌన్: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి రహమత్ హుస్సేన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో ఉందన్నారు.

డ్రైవింగ్‌లో నో సెల్

- ఆర్టీసీ డ్రైవర్లకు నో ఫోన్ నిబంధన
- సురక్షిత ప్రయాణానికి యాజమాన్యం నిర్ణయం
- పైలట్ ప్రాజెక్టుగా ఉట్నూర్ డిపోలో అమలు



సెక్యూరిటీ కార్యాలయంలో మొబైల్ ఇస్తున్న డ్రైవర్

ఆదిలాబాద్/ఉట్నూర్‌రూరల్: పలువురు డ్రైవర్ల నిర్లక్ష్యం ఆర్టీసీ ప్రయాణికుల ప్రాణాల మీదకు తీసుకువస్తోంది. నిర్లక్ష్య పూరితమైన డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరిగినప్పుడు పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాలను నివారించి ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ రహదారి భద్రతపై డ్రైవర్లకు పలు సందర్భాల్లో శిక్షణ సైతం అందిస్తోంది. అయినప్పటికీ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికంగా ప్రమాదాలు డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు మొబైల్ ఫోన్ వినియోగించడం వలన జరుగుతున్నాయని భావించిన ఆర్టీసీ యాజమాన్యం కొత్త ఆలోచనతో ముందుకు వచ్చింది. డ్రైవర్లకు నో ఫోన్ నిబంధన అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 11 డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. సోమవారం నుంచి ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఉట్నూర్ డిపో పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న 44 మంది డ్రైవర్లు తమ మొబైల్ ఫోన్లను డిపోలోనే డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా..

సురక్షితమైన ప్రయాణానికి పెట్టింది పేరైన ఆర్టీసీలో సైతం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని కట్టడి చేయాలనే ఉద్దేశంతో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వారికి రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి రహదారి భద్రత గురించి వివరిస్తున్నారు. అయినప్పటికీ పలు సందర్భాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం డ్రైవింగ్‌పై సెల్‌ఫోన్ ప్రభావం చూపుతోందని భావించి, విధుల్లో ఉన్నప్పుడు డ్రైవర్లు మొబైల్ ఫోన్లు తీసుకు వెళ్లకుండా నో ఫోన్ నిర్ణయాన్ని అమలులోకి తీసుకువచ్చింది. సోమవారం నుంచి ఈ నెల 30 వతేదీ వరకు నెల రోజుల పాటు ఈ నిబంధన అమలులో ఉండనుంది. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే డ్రైవర్ నడుపుతున్న బస్సులోని కండక్టర్‌కు సమాచారం అందిస్తారు. ఈ విధంగా క్షేత్రస్థాయిలో ఫలితాలను సమీక్షించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు.

బస్సు మరమ్మతులకు గురైతే..



మొబైల్ ఫోన్ డిపాజిట్ చేయడం ఇబ్బంది కాకపోయినా అత్యవసర సమయంలో మాత్రం సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారుల మొబైల్ నంబర్లన్నీ ఫోన్లోనే ఉంటాయి. బస్సు మరమ్మతులకు గురైతే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతారు. అటవీ ప్రాంతాల్లో బస్సు నడిచినప్పుడు కండక్టర్ నంబర్ సైతం పనిచేయకపోతే అవస్థలు వచ్చే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలి.

– స్వామి దాస్, డ్రైవర్, ఉట్నూర్ డిపో

పైలట్ ప్రాజెక్టుగా ఉట్నూర్



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఉట్నూర్ డిపోను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. విధుల్లోకి వచ్చే ముందు డిపో సెక్యూరిటీ కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లతోపాటు, ప్రైవేట్ హైర్ బస్సు డ్రైవర్లు కూడా మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడి ఫలితాలను ఆధారంగా చేసుకుని సంస్థ ముందుకు వెళ్లే అవకాశం ఉంది.

– ప్రతిమారెడ్డి, ఉట్నూర్ డిపో మేనేజర్

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అర్జీలు స్వీకరిస్తున్న ఏవో దామోదర స్వామి

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఐటీడీఏ ఏవో దామోదర్ స్వామి అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం శాంతినగర్‌కు చెందిన గోడం విజయ ఆశ్రమ పాఠశాలలో వర్కర్‌గా నియమించాలని, మామడ మండలం రామదారితండాకు చెందిన గుగ్లావత్ అమృత ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టా ఇప్పించాలని, తలమడుగు మండలం అర్లి (కే)కు చెందిన నారు బుమ్మన్న బోర్‌వెల్ మంజూరు చేయాలని, ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్‌కు చెందిన లలిత ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎంపీఎఫ్ కేసులు పెండింగ్‌లో ఉంచొద్దు



మాట్లాడుతున్న గోవర్ధన్

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన సీఎంపీఎఫ్ కేసులు పెండింగ్‌లో ఉంచవద్దని రామగుండం రీజినల్ సీఎంపీఎఫ్ కమిషనర్ కే.గోవర్ధన్ అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీఎంపీఎఫ్‌కు సంబంధించిన ప్రయాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జీరో పెండెన్సీ' లక్ష్యంగా పని చేయాలన్నారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్ కుమార్ మాట్లాడుతూ పెండింగ్ కేసుల సమస్యల పరిష్కారంలో మధ్య దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సేవలు పొందవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ పీవోలు కాంతారావు, శంతన్, పాల్స్‌సృజన్, పలు గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగులకు జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు అందించే విధంగా కృషి చేస్తామని సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ గోవర్ధన్ అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్‌గా సీఎంపీఎఫ్, పెన్షన్ క్లయిమ్స్ సెటిల్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ ఆసీఫ్, డీవైపీఎం సందీప్, సీనియర్ పీవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనని ఆదివాసీల ఆందోళన



రాంషావ్ (ఫైల్)



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

ఆసిఫాబాద్‌రూరల్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడిగుడి గ్రామానికి చెందిన ఆత్రం రాంషావ్ (25) జ్వరంలో బాధపడుతూ శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు సోమవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న వైద్యాధికారి మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని రాంషావ్ జ్వరం, ఫిట్స్‌తో మృతి చెందాడని, వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, ఆదివాసీ నాయకులు సంజీవ్, బాపురావు, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో అలరించిన విద్యార్థులు



దుర్యోధనుడి వేషధారణలో విద్యార్థి



పిట్టలదొర వేషధారణలో విద్యార్థి



విద్యార్థుల చేతిలో రూపుదిద్దుకున్న చిత్రాలు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్‌కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీలు ముగిశాయి. సోమవారం నిర్వహించిన పోటీల్లో చిత్రలేఖనం, నాటకాలు ఏకపాత్రాభినయం, కథలు చెప్పటం అంశాల్లో విద్యార్థులు అలరించారు. జిల్లాలోని వివిధ యాజమాన్యాలకు చెందిన 440 మంది విద్యార్థులు 11 అంశాలలో పాల్గొని ప్రతిభ చాటారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుకున్న విద్యార్థులను డీఈవో యాదయ్య అభినందించారు. జిల్లాలో మొదటి స్థానం పొందిన విద్యార్థులు త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే కళా ఉత్సవ్ పోటీలలో పాల్గొననున్నారు. గాత్ర సంగీతం సోలో సూర్య, గ్రూపులో మేరీ గ్లోరీ, వాయిద్య సంగీతం(సోలో) ధర్మశాస్త్రీ, వాయిద్య సంగీతం(గ్రూపు)లో అభిప్రేమ్ బృందం, శాస్త్రీయ నృత్యం(సోలో)లో రక్షిత(ప్రథమ), జానపద నృత్యం(గ్రూపు) సహస్ర బృందం(ప్రథమ), సంప్రదాయ కథలలో అరవింద రాణి, వశిష్ట, థియేటర్ (మిమిక్రి, నాటక, ఏకపాత్రాభినయం) పోటీల్లో కేజీబీవీ నస్పూర్ విద్యార్థుల బృందం (ప్రథమ), దృశ్య కళలు 2డీ(సోలో) విభాగంలో జెడ్పీహెచ్ఎస్ దొనబండకు చెందిన విద్యార్థి రాంచరణ్, దృశ్య కళలు త్రీడీ గ్రూపు విభాగంలో బెల్లంపల్లి కేజీబీవీకి చెందిన సుస్రీమ, త్రీడీ సోలో విభాగంలో బెల్లంపల్లి బజార్ ఏరియా జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శివప్రసాద్ ప్రథమ స్థానం సాధించారు.

ఎల్లపల్లిలో వీరగల్లు శిల్పం



వీరగల్లు శిల్పం ఇదే

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాలో శతాబ్దాల కాలం కిందటి ఎన్నో చారిత్రక అవశేషాలు దర్శనమిస్తున్నాయి. ప్రముఖ చరిత్రకారుడు కరిపె రాజ్‌కుమార్ తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని ఎల్లపల్లి శివారులో 17వ శతాబ్దం నాటి శిల్పాన్ని గుర్తించారు. వీరగల్లు, సతిగల్లు అని పేరు కలిగిన ఈ శిల్పంలో వీరుడు అలంకరించబడిన గుర్రం మీద శూలఖడ్గం, డాలుతో కూడి దృశ్యం గోచరిస్తుంది. వెనుక వైపున అతని సతి కుడిచేయి పైకెత్తి నిలబడి ఉన్న చిహ్నం కనిపిస్తుంది. రాజు తలపాగాలో సూర్యచంద్రుల చిహ్నాలు పొదగబడి ఉన్నాయి. అంటే ఆ వీరుడికీర్తి ఆచంద్రతారార్కం నిలిచిఉండాలనే అర్థం దాగిఉంది.

పబ్లిక్‌స్కూల్ ప్రవేశాల్లో ఆదివాసీలకు అన్యాయం

ఇంద్రవెల్లి: హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి సోమవారం అక్కడి కలెక్టరేట్‌లో నిర్వహించిన డ్రాలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం గిరిజనులకు 20 సీట్లు కేటాయించగా అందులో లంబాడీలకు 13, గోండ్, నాయక్‌పోడ్, పర్ధాన్, ఆంధ్ ఆదివాసీలకు 2 సట్లు, కోయలకు 2, ఎరుకలకు 2, పీవీటీజీలకు 1 సీటు మాత్రమే కేటాయించి అసలైన ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. లంబాడీలకు ఎక్కువ, ఆదివాసీ తెగలకు కలిసి తక్కువ సీట్లు కేటాయించడం సరికాదన్నారు.


పాక్షికంగా పలు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: కాజీపేట్ నుంచి బల్లార్షా వైపు వెళ్లే పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఎ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట్-బల్లార్షాల మధ్య ఆటోమెటిక్ బ్లాక్ సిగ్నలింగ్ పనుల నిమిత్తం రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాజీపేట్-సిర్పూర్‌టౌన్, బల్లార్షా-కాజీపేట్, కాజీపేట్-బల్లార్షా, భద్రాచలం రోడ్-బల్లార్షా, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాత్ర-కన్యాకుమారి, లక్నో-చెన్నై సెంట్రల్, గోరఖ్‌పూర్-యశ్వంత్‌పూర్, న్యూఢిల్లీ-విశాఖపట్నం రైళ్లను ఈ నెల 3వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

బోగీలు అందుబాటులో లేక పలు రైళ్ల రద్దు

ఆదిలాబాద్: సరిపడా బోగీ (కోచ్)లు అందుబాటులో లేక పలు రైలు సర్వీసులను మంగళవారం రద్దు చేస్తున్నట్లు నాందేడ్ రైల్వే డివిజన్ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్లీ-ఆదిలాబాద్ మధ్య నడిచే 77615 రైలు సర్వీస్, ఆదిలాబాద్-పూర్ణ మధ్య నడిచే 77616 సర్వీస్ రద్దు చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్-నాందేడ్ మధ్య నడిచే 17409 సర్వీస్, నాందేడ్-ఆదిలాబాద్ మధ్య నడిచే 17410 రైలు సైతం రద్దు చేయడం జరిగిందని వివరించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల ఓ షాపు ఎదుట సోమవారం గుర్తు తెలియని మహిళ (45) మృతి చెందింది. షాపు యజమాని ఉదయం షాపు తెరిచేందుకు రాగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మహిళ వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఆరు రోజుల నిరీక్షణకు తెర

- మత్స్యకారుల సాహసంతో గోదావరి లోంచి బయటకు వచ్చిన 300 గేదెలు



గోదావరినదిలోంచి బయటకు వస్తున్న గేదెలు

లక్ష్మణచాంద: గోదావరి మధ్యలో గల కుర్రులో చిక్కుకున్న గేదెలు ఆరు రోజులకు ఎట్టకేలకు ఒడ్డుకు చేరాయి. మండలంలోని మునిపెల్లి, పార్‌పెల్లి తండాలకు చెందిన 300 పశువులను గత నెల 27న కాపరులు గ్రామ సమీపంలోని గోదావరి కుర్రులోకి మేతకోసం తోలుకెళ్లారు. మధ్యాహ్నం ఎగువన మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరినదిలోకి వదిలారు. దీంతో నది ప్రవాహం పెరగడంతో అక్కడి నుంచి మునిపెల్లికి చెందిన ఇద్దరు పశువుల కాపరులు ఇంటికి తిరిగొచ్చారు. పార్‌పెల్లి తండా కాపరి శంకర్‌తో పాటు పశువులు అక్కడే చిక్కుకున్నాయి. మరుసటి రోజు కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేక చొరవతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సాహసించి శంకర్‌ను బోటుల ద్వారా బయటకు తీసుకొచ్చారు. కానీ గేదెలు అక్కడే ఉండిపోయాయి.

గేట్లు దింపడంతో...

రెండు గ్రామాల ప్రజలు విషయాన్ని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి తెలుపడంతో వెంటనే స్పందించి ప్రాజెక్టు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గేట్లు దింపించారు. సోమవారం గోదావరిలో నీటి ప్రవాహం తగ్గడంతో మునిపెల్లికి చెందిన మత్స్యకారులు పల్లికొండ శ్రీనివాస్, బొడ్డు ఆశన్న, బొడ్డు సాయన్న, రాములు, చైర్మన్ సాయన్న తెప్పల సాయంతో కుర్రు వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న 300 గేదెలను నదిలోకి దింపి మళ్లీ వాటి వెనక తెప్పల సాయంతో క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో ఆరురోజుల నిరీక్షణకు తెరపడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆరు రోజులుగా రక్షణ...

గోదావరి నది మధ్యలో చిక్కుకున్న గేదెలలో కొన్ని రావడానికి ప్రయత్నించినా అందులో ఉన్న పోతు (మగ గేదె) నీటి ప్రవాహాన్ని అనుక్షణం గమనిస్తూ గేదెలను నీటిలోకి దిగకుండా వాటిని పైకి వెళ్లేలా చేసిందని నిత్యం ఒడ్డువద్దకు వచ్చి గమనించిన గ్రామస్తులు తెలిపారు. ఆ శివుడే పోతు రూపంలో తమ గేదెలను ఆరు రోజులపాటు రక్షించాడని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

మాజీ మావో దంపతులకు ఘనస్వాగతం



శాలువాతో సత్కరిస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మండలంలోని అగర్‌గూడకు చెందిన మాజీ మావోయిస్టు చౌదరి అంకుబాయి-గోపన్న దంపతులకు గ్రామస్తులు సోమవారం ఘనస్వాగతం పలికారు. 37 ఏళ్ల క్రితం అప్పటి పీపుల్స్‌వార్ పార్టీలోకి వెళ్లిన అంకుబాయి ఉద్యమ సమయంలో వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. తల్లిదండ్రులు మరణించినా ఇంటి ముఖం చూడలేదు. సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానానికి వీడ్కోలు పలికి జూలైలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎదుట దంపతులిద్దరు లొంగిపోయారు. మొదటిసారి గ్రామానికి వచ్చిన మాజీ మావోయిస్టు దంపతులతో గ్రామస్తులు జ్ఞాపకాలను పంచుకున్నారు.

చాలా ఆనందంగా ఉంది

ఉద్యమబాట పట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇంటికి రాలేదు. అమ్మానాన్నల చివరి చూపు చూడలేదు. అనారోగ్యంతో ఉద్యమ బాట వీడి పోలీసుల ఎదుట లొంగిపోయా. చాలా ఏళ్ల తర్వాత ఇంటికి రావడం ఆనందంగా ఉంది. చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నా. జీవితంలో ఇలాంటి రోజు వస్తుందని అనుకోలేదు. చాలా ఆనందంగా ఉంది.

– చౌదరి అంకుబాయి

చెన్నూర్ ఎస్‌బీఐలో లావాదేవీలు షురూ

- పది రోజుల తర్వాత బ్యాంక్‌కు ఖాతాదారులు



బ్యాంకులో ఖాతాదారులు

చెన్నూర్: చెన్నూర్ ఎస్‌బీఐలో పది రోజుల క్రితం జరిగిన భారీ కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. విచారణ పేరుతో ఆర్ఎం రితేశ్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు పది రోజుల నుంచి బ్యాంక్‌లో ఖాతాదారుల లావాదేవీలు జరగలేదు. బ్యాంక్‌లో మాయమైన బంగారు ఆభరణాలు 75 శాతం 15.237 కిలోల బంగారం, రూ.1.61 లక్షల నగదును ఆదివారం రికవరీ చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం బ్యాంక్‌ను తెరిచిన అధికారులు ఖాతాదారులకు సేవలందించారు.

బాధితుల్లో కొనసాగుతున్న ఆందోళన

బ్యాంకులో మాయమైన బంగారు ఆభరణాలు 75 శాతం రికవరీ అయినప్పటికీ ఎప్పుడిస్తారోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. కొందరు హెల్ప్‌లైన్‌కు వాట్సాప్ మేసేజ్‌ల ద్వారా బ్యాంక్ అధికారులను వివరాలు అడుగుతున్నట్లు తెలిసింది.

కొనసాగుతున్న విచారణ

బ్యాంకు కుంభకోణంలో 75 శాతం బంగారం రికవరీకాగా మిగిలిన బంగారాన్ని రికవరీ చేసేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. చెన్నూర్ ముత్తూట్ ఫిన్‌కార్ప్, ముత్తూట్ గోల్డ్‌లోన్ కంపెనీలలో సీఐ దేవేందర్‌రావు ఆధ్వర్యంలో విచారణ జరిపారు. ముత్తూట్ సంస్థ మేనేజర్లు అందుబాటులో లేకపోవడంతో విచారణ రేపటికి వాయిదా వేసినట్లు తెలిసింది. చెన్నూర్‌తో పాటు మంచిర్యాల ముత్తూట్ సంస్థల్లో సైతం విచారణ జరిపినట్లు సమాచారం.

గోదావరి జలాల తరలింపునకు కుట్ర


- కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటే
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్

మంచిర్యాలక్రైం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాత స్నేహితుడు చంద్రబాబునాయుడు, కొత్త స్నేహితుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గురుదక్షిణ కింద మన గోదావరి జలాలను తరలించేందుకే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై అవినీతి జరిగిందని, విచారణ నిమిత్తం సీబీఐకి అప్పగించాడని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై కేసీఆర్, హరీశ్‌రావుపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ రూ.93వేల కోట్లతో నిర్మిస్తే లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. ప్రాజెక్ట్‌కు 87 పిల్లర్లు ఉండగా అందులో రెండు మాత్రమే కుంగిపోయాయన్నారు. తెలంగాణలో సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థల జోక్యం ఉండదని చెప్పిన సీఎం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ సీబీఐకి ఎలా అప్పగించారని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


'కడెం' ఎనిమిది గేట్లు ఎత్తివేత



దిగువకు వెళ్తున్న వరదనీరు

కడెం ప్రాజెక్టుకు సోమవారం 64,980 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు ఎనిమిది గేట్లు ఎత్తి 98,088 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి 11 గంటలకు మరో రెండు గేట్లు ఎత్తి ఔట్‌ఫ్లోను 1,26,412 క్యూసెక్కులకు పెంచారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 696.755 అడుగుల నీటి మట్టం ఉంది. – కడెం

భూమికి పచ్చని రంగేసినట్టు



పచ్చగా కనిపిస్తున్న వరి పొలాలు

నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద మండలం వడ్యాల్, రాచాపూర్ గ్రామాల మధ్య పచ్చని పంట పొలాలు కనుచూపు మేర భూమికి పచ్చని రంగేసినట్టు కనిపిస్తూ ప్రకృతి ప్రేమికుల మనసు దోచేస్తున్నాయి. ఈ అందాలను వీక్షించేందుకు ఉదయం, సాయంత్రం ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి వస్తారని వడ్యాల్, రాచాపూర్ గ్రామస్తులు పేర్కొంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్